క్లుప్తంగా

ఈవీఎంలకు పటిష్ట భద్రత: జిల్లా కలెక్టర్


స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న ఆర్వో మాధవీలత తదితరులు

రాజానగరం: జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం యూనిట్లను గట్టి బందోబస్తు నడుమ భద్రపరిచామని జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి కె.మాధవీలత తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూములలో భద్రపరచిన ఈవీఎం యూనిట్లను గురువారం పరిశీలించారు. వీటిని భద్రపరిచే క్రమంలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలు మూడు షిఫ్టులలో పహారా కాస్తున్నాయని, గెజిట్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ ప్రాంతానికి ఒక కిలోమీటర్ దూరంలో విధులు నిర్వర్తించే అధికారులు మినహా, ఇతరులెవ్వరూ గుంపులుగా ఉండటం, సమావేశాలు నిర్వహించడం నిషిద్ధమన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడంచెల భద్రత

నన్నయ వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. డీఎస్పీ, సీఐ, మొబైల్ టీమ్, సీఆర్‌పీఎఫ్, ఆర్మ్ రిజర్వు ఫోర్సెస్, రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే 144 సెక్షన్ కూడా అమలులో ఉంటుందన్నారు. ఆమె వెంట అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులు ఎస్.తేజ్ భరత్, కె.దినేష్ కుమార్, అశుతోష్ శ్రీవాత్సవ్, ఎ.చైత్రవర్షిణి, ఎం.మాధురి, ఆర్వీ రమణ నాయక్, ఎల్.శివజ్యోతి, అదనపు ఎస్పీలు ఎల్.చెంచిరెడ్డి, ఆర్.కృష్ణ నాయక్, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి విశ్వాసికి దైవ చింతన ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రేమరాజు

నల్లజర్ల: నేటి సమాజంలో ప్రతి విశ్వాసి దైవ చింతన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం దైవజనులు ఎస్.ప్రేమరాజు అన్నారు. గురువారం అచ్చన్నపాలెం కాకర్ల కల్యాణ మండపంలో పాస్టర్ సీహెచ్ మత్తయి ఆధ్వర్యంలో 14వ వార్షిక క్రీస్తు సమాధాన పండగలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమరాజు మాట్లాడుతూ పేదవారిపై దయాగుణం కలిగి ఉండాలన్నారు. ప్రపంచంలో శాంతి సమాధానాలు కరువయ్యాయని విచారం వ్యక్తం చేశారు. కొంతమంది వ్యక్తులు తమ జీవనగమనంలో అనేక రకాలుగా కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకున్నప్పటికీ, సంపాదన ఆపేక్షలో పడి స్వసుఖాన్ని కూడా వదిలేస్తున్నారన్నారు. వారు చిన్న చిన్న సరదాలు కూడా తీర్చుకోవడం అనవసరమైనదిగా భావిస్తున్నారన్నారు. తన కోసం కొంత, సమాజం కోసం కొంత కేటాయించాలనే కనీస ఇంగిత జ్ఞానం ఉండటం లేదన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలన్నారు. ప్రతి విశ్వాసి పాపం విడిచి, పరిశుద్ధత వైపు పయనించాలన్నారు. దేవుని ఆజ్ఞలను అనుసరించిన వారు దినదినాభివృద్ధి చెందుతారన్నారు.

18న వాసవీ మాత జయంతి

కొవ్వూరు: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని ఈ నెల 18వ తేదీన ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు పట్టణ సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు తెలిపారు. ఉదయం అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు, సామూహిక సహస్ర కుంకుమార్చనలు నిర్వహించనున్నట్టు వివరించారు. అమ్మవారిని మామిడి పండ్లతో అలంకరణ చేయనున్నట్టు తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

దేవరపల్లి: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని గోపాలపురం మండలం చిట్యాలలో గురువారం దాడులు నిర్వహించినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. దాడుల్లో పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల ఏర్పాటు

నిడదవోలు రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో 40 సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసినట్టు క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు గురువారం తెలిపారు. డి.ముప్పవరం ప్రధాన కూడలిలో సిమెంట్ బల్లలను ఆయన ప్రారంభించారు. స్థానిక ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోటరీ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

చదువూ సంస్కారాల బడి

- సంస్కృతీ సంప్రదాయాలపై పిల్లలకు శిక్షణ
- పూర్వపు పశ్చిమ గోదావరిలో 32 బాలవికాస్ కేంద్రాల ఏర్పాటు
- పుల్లలపాడు కేంద్రంలో శిక్షణ ప్రారంభం


ఉప్పలపాటి మాధవరావు

నల్లజర్ల: మానవతా విలువలను సమాధి చేస్తున్న ఈ సమాజం ఎటుపోతుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. చిన్నతనం నుంచే పిల్లల్లో మంచి విలువలకు బీజం వేస్తే.. వారు పెద్దయ్యాక ఉత్తమ పౌరులుగా ఎదుగుతారనడంలో సందేహం లేదు. దేశీయ సంస్కృతీ సంప్రదాయాలను విస్మరించి, పాశ్చాత్య పోకడలకు ప్రాధాన్యమివ్వడం.. సమాజంపై తీవ్ర దుష్ప్రభావం చూపడానికి కారణం. అందువల్లే చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, సంస్కృతీ సంప్రదాయాలపై పట్టు ఉండేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయి బాలవికాస్ కేంద్రాలు. పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలో 32 చోట్ల ఇవి చురుగ్గా పనిచేస్తున్నాయి.

విద్యార్థి దశ నుంచే..

భారతీయ సనాతన ధర్మం, సంస్కృతీసంప్రదాయాలను పిల్లల్లో విద్యార్థి దశ నుంచే నేర్పించాలన్న ఉద్దేశంతో పూర్వ పశ్చిమ గోదావరి జిల్లాలో 32 చోట్ల బాలవికాస్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ కొవ్వూరు డివిజన్ ధర్మప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు తెలిపారు. నల్లజర్ల మండలం పుల్లలపాడు వేములమ్మగుడి ప్రాంగణంలో నిర్వహిస్తున్న బాలవికాస్ కేంద్రాన్ని మాధవరావు గురువారం సాయంత్రం సందర్శించారు. పది, పన్నెండేళ్ల వయస్సు ఉన్న వారికి సాయంత్రం వేళల్లో చదువు చెప్పడంతో పాటు, సంస్కారాన్ని నేర్పుతారన్నారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, పరోపకారం, మన కుటుంబం, మన గ్రామం, దేశం ఇలా ప్రతి అంశంపై అవగాహన కల్పిస్తారన్నారు.


పుల్లలపాడు బాల వికాస్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఉత్తమ పౌరునిగా..

చదువుతో పాటు సత్యం, శాంతి, కరుణ, క్రమశిక్షణ, క్షమ, సమయ పాలన, సేవా ధర్మం, ఆత్మ విశ్వాసం, న్యాయం, సమత-మమత వంటి గుణశీలాలతో కూడిన ఆధ్యాత్మిక విద్యను బోధిస్తారని వివరించారు. ఆయా కేంద్రాల్లో మాతీజీ(వలంటీర్)లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పిల్లలకు చదువుతో పాటు, వారిలో సంస్కార విలువలు పెంపొందించడమే లక్ష్యంగా ఈ బాల వికాస్ కేంద్రాలు పని చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు బడి నుంచి వచ్చాక, పుస్తకాలను పడేసి ఆటపాటలకు, వారి కులవృత్తుల పనులకు వెళ్లిపోతుంటారని, చదువుపై అంతగా శ్రద్ధ చూపరని, అటువంటి వారిని సాయంత్రం వేళలో పాఠశాలల్లో చెప్పిన పాఠాలు చదివించడం, ఇంటి పని చేయించడం, ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయడం వంటి వాటితో పాటు, దేశభక్తి గేయాలు, ఆట,పాట, సుభాషితాలు, అమృత వచనాలు, ఆసనాలు, సూర్య నమస్కారాలు, దేశభక్తికి సంబంధించి నీతికథలు చెబుతుంటారన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై గౌరవం, చదువులో రాణించడం వంటి అంశాలు నేర్పిస్తారన్నారు. ఆయా అంశాల్లో నిష్ణాతులైన వారితో ప్రసంగాలు చెప్పిస్తుంటారన్నారు. వేసవిలోను ఈ కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు.

వేసవి జ్ఞాన శిబిరం ప్రారంభం

తాళ్లపూడి: ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ సంస్థ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ సంయుక్తాధ్వర్యంలో గ్రంథాలయాల్లో పాఠశాల విద్యార్థులకు బుధవారం నుంచి వచ్చే నెల ఏడో తేదీ వరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి జ్ఞాన శిబిరం ఏర్పాటు చేసినట్టు గ్రంథాలయాధికారి ఏ.నరేష్ తెలిపారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద వేసవి జ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో స్టోరీ టెల్లింగ్‌లో భాగంగా కథను చదివించారు. అదేవిధంగా గ్రంథాలయాధికారి నరేష్ మాట్లాడుతూ ప్రతిరోజూ జరిగే వేసవి విజ్ఞాన శిబిరానికి విద్యార్థినీవిద్యార్థులను తల్లిదండ్రులు తప్పకుండా పంపించాలని కోరారు. అదేవిధంగా విద్యార్థినీవిద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో గ్రామర్ చెప్పడం, చదివించడం, వారితో మాట్లాడించడం, కొన్ని ఆటలు ఆడించడం ప్రతిరోజు కార్యక్రమంలో భాగంగా జరుగుతాయని వివరించారు. చివరి రోజున విజేతలకు బహుమతులు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ స్కూల్ టీచర్ జి.సూర్యనారాయణ, చదువరుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.


తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో కథ చదువుతున్న చిన్నారి

మదన గోపాలస్వామి కల్యాణానికి ఏర్పాట్లు


రుక్మిణి, సత్యభామ సమేత మదన గోపాలస్వామివారు

నిడదవోలు: పట్టణ నడిబొడ్డున ఉన్న మదన గోపాలస్వామి వారి ఆలయంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న రుక్మిణి, సత్యభామ సమేత మదన గోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 19న సాయంత్రం 6.30కు రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి వార్లకు దివ్య కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ నామా సూర్యప్రకాశరావు, అర్చకులు గోవర్ధనం దుర్గప్రసాదాచార్యులు తెలిపారు. ఈ నెల 20న స్వామివారు, అమ్మవార్లకు సహస్రనామ పూజలు, మదన గోపాలస్వామి వారి మహిళా భజన మండలి వారితో విష్ణు, లక్ష్మీ సహస్రనామ పారాయణం, అమ్మవారికి కుంకుమ పూజలు, గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ నెల 21న స్వామివారు, అమ్మవార్లకు సహస్రనామ పూజలు, భ్రామరీ కూచిపూడి నాట్య మండలి వారితో భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ నెల 23న అన్నమాచార్య సంకీర్తనలు, స్వామి వారి పుష్పయాగోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఓ నామా సూర్యప్రకాశరావు తెలిపారు.

సేంద్రియ ఎరువులపై రైతుల ఆసక్తి

నల్లజర్ల: సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తిస్తున్న పలువురు రైతులు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులను వినియోగించాలని వ్యవసాయాధికారుల సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పశువుల పేడ, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని పొలాల్లో వేసుకుంటున్నారు. మరి కొందరు ఇతర రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.అనేక మంది రైతులు ఈ సేంద్రియ సాగు విధానానికి సన్నద్ధమవుతున్నారు. తరచూ రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గి పంటలకు చీడపీడలు సోకి ఉత్పత్తులు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు.

రైతులకు ఎంతో ప్రయోజనం

సేంద్రియ ఎరువుల వాడకం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారి కమల్‌రాజ్ వివరిస్తున్నారు.పశువుల పేడ, పూడిక మట్టి వేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయన్నారు.అంతేగాక భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండి పోకుండా దోహదపడతాయన్నారు. సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో చీడపీడలు, తెగుళ్లు సోకవన్నారు. చెరువు మట్టి, పశువుల పేడలో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ వంటి పోషక విలువలు లభించడంతో పైర్లు అధిక దిగుబడి ఇస్తాయన్నారు.


చేలల్లో గుట్టలుగా వేసిన పశువుల పెంట


పశువుల శాలల నుంచి పేడను పొలాలకు తరలిస్తున్న రైతులు

ఓటింగ్‌లో మహిళలదే పైచేయి..

చాగల్లు: సార్వత్రిక ఎన్నికల్లో ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో మండలంలోని మహిళా ఓటర్లే ఎక్కువగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. చాగల్లు మండలంలో 52,441 మంది ఓటర్లు ఉండగా, వారిలో 45,285 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 26,766 మంది మహిళా ఓటర్లు ఉండగా, 22,929 మంది ఓటు వేశారు. అలాగే 25,675 మంది పురుషులుండగా, వీరిలో 22,356 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 86 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు.


ఫ్యాన్‌కు పల్లెలు ఫ్యాన్స్

చాగల్లు మండలంలో ఈసారి కూడా ప్రజలు వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపారనే విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం కుల మత, రాజకీయ పార్టీలను చూడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ అందించారు. మండలంలో 52,441 ఓట్లు ఉండగా, అందులో 45,285 ఓట్లు పోలయ్యాయి. వీటిలో సుమారు సగానికి పైగా వైఎస్సార్ సీపీకి పడినట్టు రాజకీయ విశ్లేషకుల అంచనా. అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఈబీసీ నేస్తం, రుణ మాఫీ, కాపు నేస్తం, నాడు-నేడు, రైతు భరోసా వంటి పథకాలతో ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూరడంతో, ప్రజలు టీడీపీని వ్యతిరేకించి వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేశారని అంటున్నారు. మండలంలో చాగల్లు, ఊనగట్ల, చిక్కాల, దారవరం తదితర గ్రామాల్లో అత్యధిక మంది ఓటర్లు ఫ్యాన్ గుర్తుకే మద్దతు తెలిపినట్టు చర్చించుకుంటున్నారు..


బ్రాహ్మణగూడెంలో ఓటు వేసేందుకు వెళుతున్న వృద్ధులు, మహిళలు (ఫైల్)

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

దేవరపల్లి: శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు దేవరపల్లిలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారు వివిధ రకాల సుగంధ పుష్పాలతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం శ్రీవారి శోభాయాత్ర, సేనాధిపతి విష్వక్సేన తిరువీధి ఉత్సవం, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురారోహణ, ధ్వజపటవాస్తు పూజ, మంగళాశాసనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ వరకు జరుగుతాయి. 18న సాయంత్రం 7 గంటల నుంచి శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. 19న ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరుగుతుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లు, స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.


దేవరపల్లిలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ముస్తాబైన శ్రీవారి ఆలయం


శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సంక్షేమ ప్రభుత్వానికే ఓటర్ల ఆదరణ

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ

చాగల్లు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో ఆదరించారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ అన్నారు. పోలింగ్ ముగిసిన సందర్భంగా ఆయన గురువారం చాగల్లులో విలేకరులతో మాట్లాడారు. కొవ్వూరు నియోజకవర్గంలో 85.69 శాతం పోలింగ్ జరిగిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించేందుకు పోలింగ్ రోజున ఉదయం ఆరు గంటల నుంచే వృద్ధులు, మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచీ పోలింగ్ పూర్తయ్యే వరకూ కష్టపడి పని చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు ప్రత్యేకంగా ఆయన అభినందనలు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి తలారి వెంకట్రావు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. వైఎస్సార్ సీపీపై విపక్షాలు ఎన్ని అభాండాలు వేసినా ప్రజలు నమ్మలేదని, పోలింగ్ రోజు ఓటింగ్ సరళిని చూస్తే ప్రజలకు జగనన్నపై నమ్మకం, -విశ్వాసం మరింత పెరిగిందన్నారు. ఏది ఏమైనా కొవ్వూరులో వైఎస్సార్ సీపీకి భారీ మెజార్టీ తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.


ఎస్.రాజీవ్‌కృష్ణ, పార్టీ పరిశీలకుడు

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


గౌరీపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ వద్ద నిర్వహిస్తున్న ర్యాలీ


కె.సావరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

దేవరపల్లి: ప్రజలు డెంగీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ జె.సతీష్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గౌరీపట్నం, దుద్దుకూరు, ఐ.పంగిడి గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె.సతీష్ మాట్లాడుతూ టైగర్ దోమ కుట్టడం వల్ల డెంగీ వ్యాధి వస్తోందన్నారు. జ్వరం, తలనొప్పి, వంటి నొప్పులు, కొన్ని సందర్భాల్లో వ్యాధి తీవ్రతను బట్టి శరీరంపై దద్దుర్లు వస్తాయన్నారు. జ్వరం వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తే రక్తంలో ప్లేట్‌లెట్స్ స్థాయి తగ్గే అవకాశం ఉందన్నారు, ఒక్కొక్కసారి వ్యాధి తీవ్రత వల్ల ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుందన్నారు. డాక్టర్ వై.సృజన మాట్లాడుతూ వ్యాధి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఇంటిలోపల, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఏసీ, కూలర్, పూలకుండీల్లో, కొబ్బరి చిప్పలు తదితర వాటిలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమ తెరలు వాడాలని, పగటిపూట శరీరభాగాలు బాగా కప్పిన వస్త్రాలు ధరించాలన్నారు. నీటి నిల్వ చేసే ట్యాంకులపై తప్పనిసరిగా మూతలు ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎ.చిన్నికృష్ణుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో డెంగీ నియంత్రణ

చాగల్లు: డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బ్రాహ్మణగూడెం, చాగల్లు, కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గురువారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి కె.నిషిత మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంచుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు పీఆర్ఎల్ దేవి మాట్లాడుతూ వాడిన ప్లాస్టిక్ గ్లాసులు, కొబ్బరి బోండాలు బయట పడేస్తే, వర్షాలతో అందులో నీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పీహెచ్ ఎస్ పద్మ, ఎంపీహెచ్ఏ ఎం.రాజశేఖర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. చాగల్లు, కలవలపల్లి పీహెచ్‌సీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

ఉండ్రాజవరం: దోమల నివారణతోనే వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యులు రాజనాల ప్రసాద్ తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కె.సావరం గ్రామంలో గురువారం అవగాహన సదస్సుతో పాటు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైగర్ దోమ కాటు ద్వారా వ్యాపించే డెంగీ వ్యాధి జ్వరంతో బయట పడుతుందని చెప్పారు. పగలు మాత్రమే ఈ దోమ కుడుతుందని, దోమ పుట్టుకకు కారణమైన లార్వా దశలోనే చెక్ పెట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో అవసరం లేని నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్యాలక్ష్మి ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై ప్రజల్లో అవగాహన పెంచండి

- జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ జ్యోతి

కొవ్వూరు: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణంలో క్రిస్టియన్‌పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. విలేజ్ హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంట్లో నీళ్లు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైడేగా ఫ్రైడేను నిర్వహించడం ద్వారా డెంగీ వ్యాధి వ్యాప్తికి కారణమైన దోమలను నివారించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కొవ్వూరు క్రిస్టియన్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలి

రంగంపేట: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా వేసవి విజ్ఞాన శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తి, నైపుణ్యాలను వెలికి తీయొచ్చన్నారు. వచ్చే నెల 7వ తేదీ వరకూ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణలో భాగంగా నీతి కథలు చెప్పడం, తెలుగు వ్యాకరణం, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు దూరంగా ఉంటూ విద్యపై ఆసక్తి చూపాలని సూచించారు. విద్య ద్వారా మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ అలవడుతాయని, శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వి.వెంకటరమణ, రిటైర్డ్ ఇరిగేషన్ ఉద్యోగి పీవీ ప్రసాద్, షేక్ వలీ, ఎం.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.